


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 102 -

## వనజ కథ

**వారానికి సరిపడా** సరుకులన్నీ జమియాలో (అంగడి) కొనుక్కొచ్చి వంటింటి గుమ్మంలో పెట్టి వెళ్ళిపోయాడు డ్రైవర్ ఖాజా. అందులో కూరగాయలు, ఆకు కూరలతో పాటూ మాంసం, చేపలు, రొయ్యలు, చికెన్ కూడా వున్నాయి. వంటిల్లంతా చేపల వాసనతో నిండిపోయింది. ఇప్పుడవన్నీ శుభ్రం చేసి ఫ్రిజ్ లో వుంచాలి.
ఈ లోపల మధ్యాహ్నానికి అన్నం, కోడి మరాగ్ (కూర), సలాడ్ చెయ్యాలి. దేవుడు నాలుగు చేతులు ఇస్తే బావుండు అనుకుంటూ ముందుకు కదిలింది వనజ. బాబా వంటింట్లోకి వచ్చి రెండు గ్లాసుల బతాతా జ్యూస్ (ఆరెంజ్) చెయ్యమని ఆర్డరేసాడు.
నారింజ పండ్ల రసం తీసి రెండు గ్లాసుల్లో పోసి హాల్లోకి తీసుకెళ్ళింది. చూస్తూనే "హేయ్ వనజా నెత్తి మీద గుడ్డ ఏదే గాడిదా" అని గట్టిగా అరిచింది మామా.
ఆ అరుపుకు చేతులు వణికాయి. నారింజ రసం తొణికి కింద కార్పెట్ మీద పడింది. మామా కొట్టిన దెబ్బ చెంప మీద పడింది. తేరుకుని తెప్పరిల్లి చెంప తడుముకుంది వనజ. కళ్ళ నిండా నీళ్ళు.
"ఏమే గాడిదా.. ఎన్నిసార్లు చెప్పాలి నీకు. తలకు హిజాబ్ చుట్టుకోవాలని తెలీదా. ఆడదానివి కాదా. సిగ్గులేదా. గుడ్డ కప్పుకోకుండా అలాగే మగాళ్ళ ముందుకు వచ్చేస్తావా. ఇలాకాదే నీకు. వుండు రేపు చెప్తా నీ పని" అంటూ పళ్ళు కొరికింది మామా. భయపడి వంటింట్లోకి పరిగెత్తింది. పని చెయ్యడానికి శక్తి చాలలేదు. అయినా యంత్రంలా కదులుతోంది. కువైట్ ఇంట్లో పని చెయ్యడమంటే మాటలు కాదు.

తనతో పాటూ పని చేసే శ్రీలంక కద్దామా (పనిమనిషి) ఈ బాధలు భరించలేక నాల్రోజుల ముందు రాత్రికి రాత్రే పారిపోయింది. దొరికితే చంపేద్దామనే కోపంతో ఇంకా వెతుకుతూనే వున్నాడు బాబా.
ఆ పనంతా మీద పడి ఊపిరాడటం లేదు వనజకు. నిష్కారణంగా ఆ కోపానికి కూడా వనజే బలవుతోంది.

అసలే కోతి ఆపై కల్లు తాగింది అన్నట్లుగా వుంది మామా పరిస్థితి. అగ్గి మీద గుగ్గిలం అవుతోంది. అకారణంగా వనజ మీద విరుచుకు పడుతోంది. వనజకు పని భారమై వళ్ళు అలిసి జ్వరం వచ్చినట్లుగా వుంది. పట్టించుకునే దిక్కేదీ.

మరుసటిరోజు ఉదయాన్నే మామా వనజకు గుండు కొట్టించింది. మంగలి స్త్రీ వచ్చి కత్తితో తల మీద వెంట్రుకలు తీస్తుంటే దు:ఖాన్ని దిగమింగుకుంటూ మౌనంగా వుండిపోయింది వనజ. తిరగబడితే ఏమవుతుందో బాగా తెలుసు ఆమెకు. అంతే కాదు ముల్లాను పిలిపించి "బిస్మిల్లా రహమాన్ రహీం" అని ఆమె చేత పలికించి "ఇక నువ్వు కాఫిర్ కాదు.

పరమ పవిత్రమైన ముస్లిం స్త్రీవి. అల్లా ఒక్కడే దేవుడని తెలుసుకో. ఇప్పుడు నువ్వు అరబ్బీ నేర్చుకుని ఖురాన్ చదివి నమాజ్ చెయ్యాలి. అలా చేస్తేనే చచ్చాక నువ్వు స్వర్గానికి పోతావు. లేకపోతే నరకానికి తీసుకుని పోయి నిన్ను సలసలా కాగే నూనెలో వేసి కాలుస్తారు. ఇకనుండీ నువ్వు బురఖా వేసుకోనిదే మగవాని ముందుకు రాకూడదు" అని ఆంక్షలు పెట్టింది. చిన్న తప్పుకు పెద్ద శిక్ష.

పిల్లలు వనజ గుండును చూసి ఘొల్లున నవ్వారు.ఆ రాత్రి కంటికి మింటికి ధారగా ఏడ్చింది వనజ. కన్నీళ్ళే ఆమెను ఓదార్చాయి. అసహాయులైన స్త్రీలే కదా పరదేశానికి పని చేయడానికి వస్తారు.

ఆమెకు తన గతం గుర్తొచ్చింది. కడప జిల్లాలోని మారుమూల గ్రామం తనది. అక్కడ పురుషాధిపత్యం ఎక్కువ. పదో తరగతి పాసవగానే ఆడపిల్లకు పెద్ద చదువులు ఎందుకంటూ చదువు మానిపించారు. చదువుకుంటానని ఏడ్చింది వనజ. వినకుండా సంబంధాలు చూసి అందరిలా తనకూ పెళ్ళి చేసి అమ్మానాన్నలు గుండెల మీద కుంపటిని దింపుకున్నారు.

అత్తగారి ఇంట్లో మామ, భర్త, మరిది అందరూ తాగుబోతులే. సాయంత్రమయితే చాలు ఊళ్ళోని మగవాళ్ళు తాగడం భార్యలను తన్నడం నిత్యకృత్యం. ఆడది బాధలను భరిస్తూ ఒక బానిసలా పడి వుండాలి. నోరెత్తకుండా ఇంటిపని, పొలంపని చేస్తూ భర్తకు సేవలు చెయ్యాలి. అవే పతివ్రత లక్షణాలని సాటి స్త్రీలే చెప్పి ఒప్పించేవారు. ఇక ఆ ఇంట్లో వాళ్ళు అదనపు కట్నం తెమ్మని వనజను రోజూ సాధించేవారు.

అదంతా వనజకు రుచించలేదు. అత్తవారిల్లు నరకకూపంలా తోచింది. కొన్ని రోజులు ఓర్చుకుంది. అమ్మకు నాయనకు తోబుట్టువులకు తన బాధలు చెప్పుకుంది.

వాళ్ళు కూడా "ఆడది అన్నాక తప్పదమ్మా. సర్దుకొని సంసారం చేసుకోవాలి" అని నీతి బోధలు చేసారు. వీటికి తోడు మొగుడు అనబడే వింతజీవి తాగొచ్చి రోజూ వనజను కొట్టేవాడు.

కొట్టడం మగవాడి జన్మహక్కు అన్నట్లు ప్రవర్తించేవాడు. వాళ్ళ మాటలు, హింసలు భరించలేక ఒకరోజు ఊరికి బయట వున్న బావిలో దూకింది వనజ.

కళ్ళు తెరిచేసరికి రంగమ్మ అనే ఆవిడ పరిచర్యలు చేస్తోంది. ఆవిడే తనను కాపాడిందని అప్పటికి ఐదు రోజులయిందని తెలుసుకుంది.

"వాళ్ళు ఇక్కడికి వచ్చారా" నీరసంగా అడిగింది వనజ.

"లేదు. ఈ విషయం నేను ఊళ్ళో తెలియనివ్వలేదు. నాకూ ముగ్గురు ఆడపిల్లలు వున్నారు. ఎన్ని బాధలు పడి వుంటే బావిలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకున్నావో నేను అర్థం చేసుకోగలను. నీకు ఒక దారి చూపించి వారి చెర నుండి విడిపిస్తాను వనజమ్మా" అంది రంగమ్మ.

గుండెనిండా ఊపిరి పీల్చుకుంది వనజ.

రంగమ్మ పెద్ద కూతురు కూడా భర్త పెట్టే బాధలు భరించలేక వాడిని వదిలించుకుని కువైట్ వెళ్ళి పోయింది. కడప జిల్లాలో చాలామంది కువైట్ వెళ్ళిన స్త్రీలకు ఇలాంటి కారణాలే వుంటాయి. అందుకే రంగమ్మ బాధపడుతూ "నువ్వు నాకు నాలుగో బిడ్డవు అనుకుంటాను వనజమ్మా. నా పెద్ద బిడ్డ సుమతికి చెప్పి నీకు వీసా తెప్పిస్తాను. నువ్వు వీళ్ళకు దూరంగా వెళ్ళిపోయి సంతోషంగా వుండు" అని చెప్పింది.

అదే మంచిది అనిపించింది వనజకు.

అక్కడే రంగమ్మ ఇంట్లోనే దాగి వుండి పాస్పోర్టు చేయించి సుమతికి పంపించారు. వెంటనే వీసా పంపింది సుమతి. అంతటితో ముగియలేదు కష్టాలు. ఒక్కోసారి అంతే. పెనం మీద నుండి పొయ్యిలో పడినట్లయింది వనజ పరిస్థితి. ఇక్కడ కువైటీ ఇల్లు మంచిది కాదు. మామా గయ్యాళి గంప. ఆమె పోరు భరించడం కష్టంగా వుంది. దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షులా వుంది. రెండేళ్ళు పూర్తి కాకుండానే తప్పించుకునే మార్గం ఏదీ కనబడటం లేదు. ఫోన్ చేసి సుమతికి చెపుదాం అనుకుంటే ఆ ఇంట్లో ఫోను మాట్లాడటం కుదరదు.

మామా కద్దామాలకు ఫోను అందనివ్వదు. అడకత్తెరలో పోక చెక్కలా నలిగిపోతోంది వనజ. ఇక్కడ కువైట్ వాళ్ళను ఎదిరిస్తే పర్యవసానం ఘోరంగా వుంటుంది.

ఆ రోజు మామా పిల్లలతో కలిసి దుబాయ్ కి బంధువుల పెళ్ళికి వెళ్ళింది. నాల్రోజుల్లో తిరిగి వస్తానని చెప్పి చంటి పిల్లవాడిని వనజకు అప్పగించి కంటికి రెప్పలా చూసుకోమని చెప్పింది. ఇంట్లో బాబాకు అమ్మ అయిన ముసలావిడ "హనాది" కూడా వుంది.

అది 1990 సంవత్సరం.

అప్పుడే గల్ఫ్ యుద్ధం మొదలయ్యింది. సద్దాం హుస్సేనుతో కలిసి ఇరాక్ సైనికులు కువైట్ పై దాడి చేసారు. పట్టణాన్ని ధ్వంసం చేసి ఇళ్ళ మీద పడ్డారు. కువైట్ వాళ్ళు కనబడితే చాలు చిత్ర హింసలు పెట్టి చంపేస్తున్నారు. సంగతి తెలిసిన మామా, పిల్లలు దుబాయ్ లోనే వుండిపోయారు. ఇక్కడ బాబా, వాళ్ళమ్మ, చంటి పిల్లవాని బాధ్యత వనజ మీద పడింది.

ఒక రోజు దుర్మార్గులైన ఇరాకీ సైనికులు ఆ వీధిలోకి వచ్చి ఇళ్ళ మీద పడి దోచుకుంటూ కువైట్ వాళ్ళను వెతికి పట్టుకుని హింసించ సాగారు. కువైట్ వాళ్ళంతా ప్రాణాలు అరచేత పట్టుకుని వేరే దేశాలకు పారిపోయారు. ఇరాకీ సైనికులు బాబాను చూస్తే చంపేస్తారని తెలుసు.అందుకే బాబాను కద్దామా (పనిమనిషి) రూములో దాచి చాటుగా భోజనం అందించింది వనజ.

డ్రైవర్ కాజా పరిగెత్తుకొచ్చి "ఇరాకీ వాళ్ళు వచ్చేస్తున్నారు" అంటూ కబురు అందించాడు.

బాబానయితే దాచిపెట్టింది కానీ పాలు తాగే పిల్లవాడిని ఎక్కడ దాచాలో అర్థం కాలేదు. బాబా తల్లి హనాది వనజ చేతులు పట్టుకుని "నేనంటే ముసలిదాన్ని చచ్చినా పరవాలేదు. ఏదో ఒకటి చేసి బాబాను, ఈ పిల్లోడిని నువ్వే కాపాడాలి వనజా" అంది ఏడుస్తూ.

వెంటనే వంటినిండా బురఖా వేసుకుంది వనజ. డ్రైవర్ ఖాజాకు నమస్కరించి "అన్నా.. బాబాను దాచిపెట్టాను. ఆయన వున్న చోటు కనబడదు. ఇప్పుడు ముక్కుపచ్చలారని ఈ పసిబిడ్డను మనం కాపాడాలి. అది మన బాధ్యత. దీనికోసం మనం చిన్న నాటకం ఆడక తప్పదు. నువ్వు సహకరించాలి" అంది అర్థింపుగా. ఏం చెయ్యాలో చెప్పింది.

"అయ్యో అంతగా చెప్పాలా వనజమ్మా.. ప్రాణం మీదికి వచ్చినప్పుడు అబద్ధం ఆడక తప్పదు. నువ్వు నిశ్చింతగా వుండు" అని ధైర్యం చెప్పాడు ఖాజా.

తలుపులు నెట్టుకుంటూ రానే వచ్చారు ఇరాకీ సైనికులు. ముసల్ది హనాది భయంతో గజగజా వణుకుతూ మూల కూర్చుంది. ఇంటి బయట కద్దామాల గదిలో.. పిల్లవాడిని బురఖా లోపల పొదువుకుని నోటికి రొమ్ము అందించింది వనజ. పిల్లవాడు పాలకోసం రొమ్మును నోట్లో పెట్టుకుని చీకసాగాడు. ఖాజా భర్తలా నటిస్తూ వనజ పక్కనే కూర్చున్నాడు. ఇల్లంతా ధ్వంసం చేసి ముసలి దాన్ని రెండు దెబ్బలు వేసి మూలన తోసి బయటికి వచ్చారు ఇరాకీ సైనికులు.

కద్దామాల గది వైపు వచ్చి "ఏయ్ ఎవరు మీరు" అంటూ ప్రశ్నించారు.

"ఇది నా భార్య. పాలు తాగే పసిపిల్లోడు నా బిడ్డ. మేము ఇండియా వాళ్ళము దొరా" అన్నాడు ఖాజా చేతులు

జోడిస్తూ.

బిడ్డను బురఖా చాటున రొమ్ముకు హత్తుకుంది వనజ.

"ఇక్కడ కువైట్ వాళ్ళు ఎవరూ లేరు కదా" ప్రశ్నించాడు ఒకడు.

"లేరు సార్. ఎవరైనా కనబడితే చెప్తాను" అన్నాడు ఖాజా వినయం చూపిస్తూ.

నమ్మారు వాళ్ళు.

మొత్తం ఇల్లంతా మరోసారి కలియచూసి ఎవరూ లేరని నిర్ధారించుకుని ముసల్దాన్ని బెదిరించి మరో ఇంటివైపు వెళ్ళిపోయారు వాళ్ళు. 'హమ్మయ్య' అనుకుంటూ ఊపిరి పీల్చుకుంది వనజ. ముసలామె సంతోషంతో "షుక్రాన్" అంటూ వనజను ఆలింగనం చేసుకుంది.

ప్రపంచ దేశాలన్నీ సద్దాం అమానుష కాండను ఖండించేసరికి, అమెరికా జోక్యం చేసుకుని కువైట్ వైపు నిలిచేసరికి సద్దాం ఇరాక్ కు పారిపోయాడు. యుద్ధం ముగిసేసరికి ఆరు నెలలు పట్టింది.

అంతా సద్దుమణిగాక మామా దుబాయ్ నుండి తిరిగి వచ్చింది. వస్తూనే వనజను కౌగిలించుకుని "నువ్వు మా పాలిట దేవతవు. నువ్వు తెలివి చూపించి రిస్క్ తీసుకోకపోతే బాబా, పసిపిల్లోడు బతికేవారు కాదు. ఈ రోజు నుంచీ నువ్వు మాకు పని మనిషివి కాదు. ఈ ఇంట్లో ఒక మనిషివి. నువ్వు జీవితాంతం సంతోషంగా ఇక్కడే మాతోపాటూ వుండవచ్చు. నీకు అన్ని సౌకర్యాలు కల్పించబడతాయి" అని చెప్పి విలువైన బహుమతులెన్నో ఇచ్చింది. ఇంటి పనికి ఇద్దరు పని మనుషులను నియమించింది. వారి అజమాయిషీ వనజకు అప్పగించింది. వనజ కష్టాలు తీరిపోయాయి.

ఆరోజు నుండీ వనజ ఆ ఇంట్లో మనిషిలా మెలగసాగింది. యుద్ధం వినాశనానికి మూలం కానీ, వనజ జీవితానికి మాత్రం మంచి రోజులను తెచ్చింది.

వనజ బురఖా లోపల పిల్లోడిని దాచి పాలు తాపి ప్రాణం కాపాడిన కథను మామా ఇప్పటికీ పిల్లవాడికే కాక తెలిసినవారందరికీ చెపుతూ వుంటుంది. పిల్లవాడు అబ్దుల్లా వనజను తల్లితో సమానంగా ప్రేమిస్తాడు

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments